# మగాళ్ళెప్పుడూ ఇంతే!

—"లక్ష్మీ శివరాం"



ఈ రోజే ఇద్దరు పిల్లలూ మా అమ్మగారింటికి వెళ్ళారు. ఇక పని తక్కువ. పైగా యేమీ తోచదు. ఉదయం శ్రీవారు ఆఫీసుకు వెళ్ళేటప్పుడే కోరాను. 'పెందరాడే యింటికి రండ'ని నా కోరికను మొదటాట సినిమా ప్రోగ్రాం కలిపారు ఆయనే.

ఇకనేం-వున్న కాస్త పనీ పెందరాడె ముగించుకొని, ముస్తాబై, ఆయన ముస్తాబుకు వేడినీళ్ళు, వేడి వేడి భోజనం, అన్నీ అయిదు గంటల లోపే సిద్ధంచేసి కూర్చున్నాను.

ఆఫీసు వదిలే టైము అయిదు అయింది. ఆపైన మరో అయిదు గంటలూ గడిచింది. మొదటాట కాదు, సినిమా రెండో ఆటకూడా ఆరంభించి వుంటారు. లోపల విసుగూ, కోపం, ఆకలి, అన్నీ మండిపోతున్నాయి. బయట పొయ్యి-పొయ్యి మీద నీళ్ళు, పొయ్యిప్రక్క భోజన పదార్థాలూ, అన్నీ చల్లారిపోయాయి.

పదకొండింటికి తలుపు దబ దబా మంటుంటే, కునుకుతోన్న కళ్ళతో పోయి తలుపు తీశాను. శ్రీవారు.

"ఏం, ఇంతసేపు వున్నారు?"

"పీక్కుతోడు" అన్నారు శ్రీవారు అడిగింది చెప్పకుండానే.

'నీళ్ళు చల్లారిపోయాయి. కాస్త ఆగండి మళ్ళా మంట చేస్తాను."

"ఊఁ...చద్దికూడు తిన్నమ్మకి మొగుడాకలి ఏం తెలుస్తుంది?"

విసుక్కుంటూ పోయి, మంచంమీద కూర్చుని బూట్లు విప్పుతున్నారు.

నేను కూడా తినలేదనీ, శ్రీవారితో పాటు తినాలని కూర్చున్నాననీ చెప్పటానికి మనస్కరించలేదు. తెలుసుకోకుండానే తిట్లు మొదలుపెట్టరాయె మగాళ్ళెప్పుడూ యింతే. వూరంతా ఆయన్ను 'ఛీ' అంటే అయ్యొచ్చి అమ్మని 'ఛీఛీ' అన్నట్టు చేస్తారు. ఆ అనుమానంతోనే అడిగాను.

"క్లబ్బులో ఓడిపోయి వచ్చారా?" అని ... పొయ్యి రాజేస్తూ.

"అన్నం పెట్టు" అన్నారు. నా మాటకి సమాధానంగా.

"అయితే, స్నానం చెయ్యరా?" "చెయ్యను, చెయ్యను, చెయ్యను."

అయినా నేను పొయ్యి మంట చేస్తూండటం చూచి గాబోలు

"అన్నం వడ్డిస్తావా? హోటల్‌కి పొమ్మంటావా? లేచారు శ్రీవారు.

ఈ బెదురుకు భార్యగనుక కాచుకొని పడి వుంది. యే హోటల్‌వాడు ఉంటాడు? అనుకున్నాను. పైకి అననేలేదు.

"వడ్డిస్తున్నాను" అన్నాను.

"మరి, పొయ్యి మంట పెడతావేం?"

"నెయ్యి కరగ పెట్టొద్దూ."

శ్రీవారు మొత్తంమీద శాంతించినట్టే కనిపించారు.

పీట వేసేటంతలో మంచినీళ్ళనీ, పళ్ళెం కడగటం ఆలస్యమయిందనీ, కేకలూ, తిట్లూ చక్కల్తో భోజనం ముగిసింది. భోంచేస్తున్నంతసేపూ అన్నం, కూరలూ, అన్నీ చల్లారిపోవటాన్నీ, కాపురం పెట్టినప్పట్నుంచీ చల్లారిన కూడే గతయిందనీ, శాపనార్థాలు పెడ్తూనే వున్నారు.

కాని - ప్రతిరోజూ పదిగంటలు దాటిందాకా రాకపోవడానికి కారణం నేనుకాదు. పోనీ పదింటికే వండుదామనుకుంటే పెందరాడవస్తే మళ్ళా వంటకాలేదని తిట్లు తప్పవు. అదీగాక పిల్లలకి పెందెవేళకే అన్నాలు కావాలి. రెండుసార్లు వండాలనుకున్నా పుల్లల ఖర్చుమీద పోట్లాట తప్పదు.

శ్రీవారికి ఇవన్నీ తెలియకనా? తెలిసిపెట్టే దీవెనలకి తెలియనట్టు వింటూ పోతేపోతుంది.

తర్వాత నేను భోజనానికి కూర్చున్నాను.

భోజనం చేస్తున్నంతసేపూ శ్రీవారికి లుంగీ యివ్వడానికనీ, తలగడక్రింద తాళంచేతులు చూపటానికనీ, బీరువా తెరవటానికనీ పక్కపొడి డబ్బాలో గిరిజెకోసనీ. యిలా భోజనం మధ్యలోనే పదిమార్లయినా లేచిపోయి వుంటాను.

భోజనాలు ముగిసి, అన్నీ సర్దుకుని, యిక పడుకోవచ్చు అనుకునేసరికి పన్నెండు గంటలు దాటిపోయింది.

ఆయన డిటెక్టివ్ నవల చదువుతూ, దీర్ఘంగా నిట్టూర్పులు తీస్తున్నారు.

యిలా మంచంమీద నడుం వాల్చారోలేదో, సిగరెట్లు అయిపోయాయట, చెప్పారు.

ప్రక్క వాటాలో నిద్రపోతూన్న పనిమనిషిని లేపి, బతిమాలి, సిగరెట్ల కోసం సినిమాహాలు దగ్గిరికి పంపించాను. సిగిరెట్లు వచ్చేదాకా, ఎదురు చూస్తూ మేలుకొని కూర్చోవాలి. కులాసా కబుర్లాడేటందుకు వీలుకాలేదు ఆయన నవలలో హత్యల మధ్యపడి ఆందోళన పడ్తున్నారు. పలకరిస్తే పైనపడి కొట్టేట్టున్నారు.

సిగిరెట్లు వచ్చాక, మళ్ళీపోయి మంచంమీద పడుకున్నాను కళ్ళు నిద్ర బరువుతో వాలిపోతున్నాయి.

"మంచినీళ్ళు యిచ్చిపో" శ్రీవారు అడిగారు.

"మంచంకిందే వున్నాయి" బద్ధకంగా అన్నాను.

"తెలుసు, యివ్వమంటున్నాను" శ్రీవారి ఆజ్ఞ యిచ్చి వచ్చాను. మరి కాస్సేపట్లో --

"ఆ కిటికీ తలుపులు మూయి"

ఈ మధ్యలో కాల్చిపారేస్తున్న సిగిరెట్లు చూచి, లేచిపోయి ఆష్‌ట్రే తెచ్చిపెట్టాను. సిగరెట్టు పీకలన్నీ ఏరి అందులో వేశాను.

ఇంకాస్సేపట్లో "దుప్పటి కప్పిపో."

ఇంకా నిద్రపోయేదెలా? మగవాళ్ళెప్పుడూ యింతే. పలికేటట్టుంటే పందిరి గుంజకి కూడా పని చెప్తారు.

కాస్త కునుకు పట్టేట్టుంటేచాలు, అంతలో ఏదో ప్రశ్న.

"పాలవాడు బాకీ అడుగుతున్నాడా?"

"వెంకట్రావు యిల్లు మార్చాడటగా?"

"యీ పగలు నాకోసం ఎవరేనా వచ్చారా?".

సమాధానాలు చెప్పేదాకా చంపుకుతినటం. చివరికి మీ నాన్నగార్ని నాలుగొందలు అప్పు అడిగాను యిచ్చాడేమో చూడు"

ఇక మా పుట్టింటి పుట్టు పూర్వోత్తరాలు, దెప్పిపొడుపులు. యిలా యిలా తాలూకా ఆఫీసులో 4 గంటలు కొట్టారు.

ఏమైనాసరే. యిక యీయనకి సమాధానం చెప్పకూడదు, పిలిచినా పోకూడదు. అనుకున్నాను.

కాని ఆయనేవచ్చి మంచంమీద కూర్చున్నారు. కాను నిద్రపోరు. నన్ను నిద్రపోనియ్యరు. కాపురానికొచ్చి నప్పట్నుంచీ అనుకుంటాను. పెందరాడే నిద్రపోవాలని. ఏదీ? ఆ అదృష్టం పట్టదే.

చుట్టుప్రక్కల కోళ్ళు కూస్తున్నాయి. మరో గంటకి ఛళ్ళున తెల్లవారుతుంది.

ఆయన నా మంచంమీద పడి మత్తుగా నిద్రపోతున్నారు. ఆయనకేం. ఆఫీసు పదిగంటలకి. హాయిగా తొమ్మిదింటిదాకా, నిద్ర లేవకపోతే యీ పగలంతాకూడా నిద్రపోతారు.

కాని నాకెలా? తొమ్మిదింటికల్లా అన్నీ సిద్ధం చేసి, పదింటికల్లా ఆయన్ని ఆఫీసుకు పంపాలి.

నిద్రకళ్ళతో, నిద్రపోతూన్న ఆయన్ని చూస్తూ ఈర్ష్యపడుతూ దిగులుగా మళ్ళీ మామూలు సంసారపు గొడవల్లో, ఇంటి పనుల్లో పడిపోయాను. అంతా మరచిపోయాను.

మధ్యాహ్నం, గుడ్డలు ఇస్త్రీకి వేస్తుంటే తెలిసింది. ఆ రాత్రి ఆయన ఎందుకంత ఆలస్యంగా వచ్చిందీ. జేబులో ఓటులు కూడివేసిన చిత్తుకాగితం, పనికిరాని రెండు పేక ముక్కలూ బయటపడ్డాయి.

**P. S.** మగవాళ్ళంతా అంతే నాకు తెలిసిన ప్రపంచంలో మా నాన్న, శ్రీవారు, మా అన్న, ఆ ముగ్గురూ అంతే.

★